క్లుప్తంగా

విద్యార్థికి సన్మానం



సన్మానిస్తున్న గ్రామస్తులు

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామానికి చెందిన లెంకపోతుల ప్రణీత్‌గౌడ్ రాష్ట్ర స్థాయిలో ర్యాంకును సాధించాడు. దీంతో గ్రామస్తులు శుక్రవారం విద్యార్థిని అతని ఇంటివద్ద శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ అబ్బి సుందరయ్య, చేవెళ్ల నర్సింలు, మధునాల శివానంద్, వినన్నగారి రవీందర్, రామస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ స్లిప్పల పంపిణీ



సంతాపూర్‌లో ఓటర్ స్లిప్స్ అందజేస్తున్న బీఎల్ఓ మహేశ్

కేశంపేట: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో బీఎల్‌ఓలు ఓటర్ స్లిప్పులను పంపిణీ చేస్తున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మే8 వరకు గ్రామాల్లో అందజేస్తారన్నారు. ఎవరికైనా ఓటర్ స్లిప్పులు అందకుంటే గ్రామాల్లో ఉండే బీఎల్‌ఓలను సంప్రదించాలని తహసీల్దార్ అజీంఅలీ సూచించారు. గ్రామాల్లో ఇంటి యజమానికి లేదా ఓటర్‌కు మాత్రమే స్లిప్పులను అందించాలన్నారు. బీఎల్‌ఓలు పంపిణీ చేయగా అందుబాటులో లేని వాటిని, మరణించిన వారి స్లిప్పులు బీఎల్‌ఓ కార్యాలయంలో ఉంచాలని ఆయన తెలిపారు. మండలంలో 43 పోలింగ్ బూతులు ఉండగా 35,830 మంది ఓటర్లు ఉన్నారు.

మాజీ సీఎం కేసీఆర్‌కు ఘన స్వాగతం



కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

షాద్‌నగర్: లోక్‌సభ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ శుక్రవారం మహబూబ్‌నగర్ ప్రచారానికి వెళ్లారు. షాద్‌నగర్ బైపాస్ మీదుగా బస్సులో వెళ్తున్న ఆయనకు పట్టణ శివారులోని యమ్మీ హోటల్ వద్ద జాతీయ రహదారిపై మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కేసీఆర్ బస్సులో నుంచే అభివాదం చేస్తూ ముందుకు సాగారు. కేసీఆర్‌కు స్వాగతం పలికేందుకు నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు షాద్‌నగర్‌కు తరలి వచ్చారు.

ఓటు హక్కు సద్వినియోగం చేసుకోండి

తహసీల్దార్ రమేశ్ కుమార్



ఓటర్ స్లిప్పులు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ రమేశ్ కుమార్

కొందుర్గు: ఓటు ఎంతో విలువైనదని, ప్రతిఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రమేశ్ కుమార్ సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని మహదేవ్‌పూర్, భైరంపల్లి, ఉత్తరాసిపల్లి, ముట్పూర్, రేగడిచిల్కమర్రి, ఉమ్మెంత్యాల గ్రామాల్లో పర్యటించి ఓటర్ స్లిప్పులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్ 'ఓటు అనే ఆయుధం' లోనే ఉందన్నారు. ప్రతిఒక్కరూ విధిగా ఓటు వేసి దేశాభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఐలు ప్రకాశ్, శివకుమార్ పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ సమావేశం

ఆమనగల్లు: రాంనుంతల గ్రామ పరిధిలోని డీఎంకే ఫంక్షన్‌హాల్‌లో శనివారం ఆమనగల్లు, కడ్తాల్ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు జగన్, బిచ్యానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి నాగర్‌కర్నూల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డా మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజవుతారని తెలిపారు.

మెజార్టీ సీట్లు బీజేపీవే

- బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించండి
- బీజేవైఎం స్వచ్ఛ భారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము
- చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాల్లో ఇంటింటి ప్రచారం



చేవెళ్ల: కేసారం గ్రామంలో బీజేపీ మండల నాయకుల ప్రచారం

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ మెజార్టీ సీట్లు గెలవబోతుందని అనంత్‌రెడ్డి, శర్వలింగం, నాగరాజు, మహేందర్ తదితరులు పేర్కొన్నారు. చేవెళ్ల మండలంలోని కేసారం గ్రామంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ పరిపాలనను వివరించారు. ఆయన చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఓటరుకు చెబుతున్నారు. బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. ఈ ఎన్నికలు రాష్ట్రానికి సంబంధించినవి కావని, ఇక్కడినుంచి అధిక ఎంపీ సీట్లు గెలిస్తే కేంద్రంలో మళ్లీ నరేంద్రమోదీ ప్రధాని అయ్యే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. గత బీఆర్ఎస్ హయాంలో గ్రామాల్లో చేపట్టిన ప్రతి అభివృద్ధి పనిలో కేంద్ర ప్రభుత్వం సహకారం ఉందని వివరిస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చెప్పే మాయ మాటలు నమ్మొద్దని వేడుకుంటున్నారు. అలాంటి పార్టీ అభ్యర్థులకు ఓటు వేస్తే ఎలాంటి ప్రయోజనం ఉండబోదని, వారి వల్ల రాష్ట్రానికి ఎలాంటి ఉపయోగం ఉండదని విమర్శిస్తున్నారు. కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వం రాబోతుందని జోస్యం చెబుతున్నారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించి మోదీకి కానుకగా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శంకర్‌పల్లిలో...

మండలంలో మున్సిపల్‌పరిధిలోని గణేశ్ నగర్‌కాలనీలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు ఓటర్లను కలిసి బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. దేశం అభివృద్ధి పథంలో నడవాలంటే ప్రధాని నరేంద్రమోదీ సమర్థుడని చెబుతున్నారు. ఆయన పాలనలోనే దేశంలో అవినీతి లేని పాలనసాగిందన్నారు. ప్రజా సంక్షేమం, దేశాభివృద్ధి జరగాలంటే అది మోదీతోనే సుసాధ్యమన్నారు. ప్రజలు అందరూ సహకరించి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ ఇన్‌చార్జి వాసదేవ్‌కన్న, మున్సిపల్ అధ్యక్షుడు సురేశ్, వీరేందర్, లోకేశ్, సురేశ్ బూత్ కమిటీ అధ్యక్షుడు బి వెంకటేశ్, మహేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, కిరణ్‌గౌడ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



షాబాద్: చర్లగూడలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేవైఎం స్వచ్ఛ భారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము



శంకర్‌పల్లి మున్సిపల్ కేంద్రంలోని గణేశ్‌నగర్ కాలనీలో ఇంటింటి ప్రచారం

చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగురవేస్తాం: రాము

షాబాద్: చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగురవేస్తామని బీజేవైఎం స్వచ్ఛ భారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము పేర్కొన్నారు. షాబాద్ మండల పరిధిలోని పటేల్‌గూడ్, చర్లగూడ తదితర గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు సమిష్టిగా విజయం కోసం కృషి చేయాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తోందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో బీజేపీకి 370పై చిలుకు సీట్లు వస్తాయని జోస్యం చెప్పారు. ఈ ఎనికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా కార్యకర్తలు నిరంతరం కష్టపడాలన్నారు. మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో ముందుకు సాగుతోందన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పేద, బడుగువర్గాల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిన్నట్లు వివరించారు. చేవెళ్ల పార్లమెంటు స్థానంలో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయ ఢంకా మోగించడం ఖాయమన్నా ు. ఎన్నికల సమయంలో ప్రజల ముందుకు వచ్చే కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను అసలు నమ్మొద్దన్నారు.

మూడోసారి విజయం ఖాయం

జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేశ్‌గుప్తా



ఇంటింటి ప్రచారంలో వెంకటేష్‌గుప్తా

షాద్‌నగర్: కేంద్రంలో మూడోసారి బీజేపీదే విజయం ఖాయమని జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేష్‌గుప్తా పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని మొగిలిగిద్ద, ఎలికట్ట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కక్కునూరి వెంకటేశ్‌గుప్తా హాజరై మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో అప్‌కీ బార్ చార్‌సౌ పార్ అనే నినాదంతో ముందుకు వెలుతున్నట్లు తెలిపారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపట్టారన్నారు. దేశంలో నిరుపేదలందరికి రేషన్ దుకాణాల ద్వారా ఉచిత బియ్యం పంపిణీ చేస్తున్నారన్నారు. అదేవిధంగా పల్లెలు, పట్టణాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తుందన్నారు. పదేళ్ల కాలంలో దేశంలో ప్రధాని మోదీ ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చి దేశ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాదులు వేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలందరు బీజేపీకి మద్దతుగా నిలబడి ఎంపీ అభ్యర్థి డీకే అరుణను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నర్సింలు, మల్లెల ఆనంద్‌కుమార్, పిల్లి సురేశ్, అంబటి శివ, సురేశ్, సారా అంజయ్య, శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలు అమలు చేయండి



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న నర్సింహారెడ్డి

గ్రామ పంచాయతీ కార్మిక సంఘం అధ్యక్షుడు నర్సింహారెడ్డి

కేశంపేట: లేబర్ కోర్టులను రద్దు చేసి 44 కార్మిక చట్టాలను అమలు చేయాలని గ్రామ పంచాయతీ కార్మిక, ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో మేడే పురస్కరించుకొని గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం కోసం మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి గ్రామ పంచాయతీ ఉద్యోగులుగా గుర్తించాలని చెప్పారు. కార్మికులశ్రేయస్సుకోసం సమగ్ర సంక్షేమ చట్టం తీసుకురావాలని ఆయన తెలిపారు. భవన నిర్మాణ కార్మికులకు రూ. 10లక్షల ప్రమాదబీమా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. డీజిల్, పెట్రోల్‌లను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలన్నారు. నిత్యావసర వస్తువులపై జీఎస్టీ తగ్గించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రయ్య, రవి, యాదయ్య, నరసింహ, స్వాతి, సురేశ్, నారాయణ, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

కమ్ముకున్న నిర్లక్ష్యం!

- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిన చెట్లు
- పట్టించుకోని అధికారులు

కొత్తూరు: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వెనకాల ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంప, తీగచెట్లు ఏపుగా పెరిగి అల్లుకున్నాయి. చెట్ల కొమ్మలు తీగలకు చుట్టుకొని పెరుగుతున్నా పట్టించుకునే వారు లేరు. ఇక్కడికి వచ్చే ప్రజలు వాహనాలను అక్కడే నిలుపుతుంటారు. దానికి తోడు ట్రాన్స్‌ఫార్మర్ పక్క గదిలోనే కార్యాలయానికి సంబంధించిన కంప్యూటర్, రికార్డుల గది ఉంది. వర్షాకాలంలో చెట్ల కొమ్మలతో వీచే గాలుల వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం లేకపోలేదు. ఏమాత్రం అశ్రద్ధ వహించినా షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం ఎక్కువ. ఇప్పటికైనా ఈ విషయంలో ట్రాన్స్‌కో అధికారులు స్పందించి కంపచెట్లను తొలగించి ప్రమాదం సంభవించక ముందే జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమష్టి కృషితో గెలుపు తథ్యం

- రంగారెడ్డి జిల్లా బీజేపీ ఓబీసీ అధ్యక్షుడు దుద్దాల లక్ష్మీనారాయణ
- నేడు జిల్లా స్థాయి సమన్వయ సమావేశం



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

మొయినాబాద్ రూరల్: సమష్టి కృషితోనే బీజేపీ గెలుపు తథ్యమని రంగారెడ్డి జిల్లా ఓబీసీ అధ్యక్షుడు దుద్దాల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ కంజర్ల మాల్‌లో ఓబీసీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. గెలుపే లక్ష్యంగా బూత్ స్థాయి నుంచి అందరు కష్టపడి పని చేయాలన్నారు. శనివారం 10 గంటలకు ఓబీసీ జిల్లా స్థాయి సమన్వయ సమావేశం హిమాయత్‌నగర్ చౌరస్తాలోని కంజర్ల మాల్‌లో నిర్వహించనున్నట్లు, ముఖ్య అతిథిగా మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు కల్వకుర్తి ఆచారి, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్‌లు పాల్గొంటారని తెలిపారు. రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాల నుంచి ఓబీసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో అసెంబ్లీ ఓబీసీ కన్వీనర్ ఎలిగని వెంకటేష్‌గౌడ్, జిల్లా కార్యదర్శి అత్తపూర్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలపై సీనియర్ల మండిపాటు

ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి ఒంటెత్తు పోకడలపై ఆవేదన



శంకర్‌పల్లిలోని కాంగ్రెస్ కార్యాలయంలో మాట్లాడుతున్న మండల నాయకులు

చేవెళ్ల: కాంగ్రెస్ సీనియర్ నాయకులకు సమాచారం ఇవ్వకుండా ఇతర పార్టీల నాయకులను చేర్చుకోవడంపై శంకర్‌పల్లి మండల నాయకులు మండిపడుతున్నారు. ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి ఒంటెత్తు పోకడలు మానుకోవాలని మండల ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎండీ నసీరుద్దీన్‌లు పేర్కొన్నారు. శంకర్‌పల్లి మండల కార్యాలయంలో శుక్రవారం రాత్రి పలువురు సీనియర్ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నాయకులు బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు కాంగ్రెస్ నాయకులను హేలన చేసి మాట్లాడిన విషయాలను గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు పార్టీలో చేరి గ్రూప్ రాజకీయాలు చేయాలని చూస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ స్కూల్ నుంచి వచ్చిన రంజిత్‌రెడ్డి కాంగ్రెస్‌లో ఉన్న సీనియర్ నాయకులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఫామ్‌హౌస్‌లో తన ఇష్టానుసారంగా బీఆర్ఎస్ నాయకులను పార్టీలోకి చేర్చుకుంటున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకోసం కష్టపడి పనిచేసినా నాయకుల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇది కాంగ్రెస్‌లో గ్రూప్ రాజకీయలు చేయటానికే తప్పా మరొకటి కాదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి బీంభరత్ ఓటమికి కారకులను ఎందుకు పార్టీలోకి తీసుకుంటున్నారని ప్రశ్నించారు. ఆ నాయకులు అధికారం ఎక్కడ ఉంటే అక్కడ ఆధిపత్యం చెలాయించేందుకు ప్రయత్నం చేస్తున్నారని దీనిని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఈ విషయంలో ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి తన తీరును మార్చుకోవాలని పార్టీలో అందరూ కష్టపడి సమిష్టిగా ముందుకెళ్లాలని సలహా ఇచ్చారు. ఇప్పటికైనా కాంగ్రెస్‌లో పాత, సీనియర్ నాయకులను విస్మరించొద్దని సూచించారు. రంగారెడ్డి, నర్సింహ్మరెడ్డి, రాజిరెడ్డి, ఏనుగు నర్సింహ్మరెడ్డి, విష్ణుకాంత్‌రెడ్డి, పాల్గొన్నారు.

దళారులను నమ్మొద్దు

ఆమనగల్లు: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనే వరి ధాన్యాన్ని విక్రయించాలని మండల వ్యవసాయాధికారి అరుణకుమారి సూచించారు. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని ఆమె కోరారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం తీసుకువచ్చిన రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం రైతుల కోసం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని చెప్పారు. కొనుగోలు కేంద్రానికి రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి చెత్త, మట్టిపెళ్లలు లేకుండా తీసుకువస్తే మద్దతు ధర లభిస్తుందని వివరించారు. వరిధాన్యాన్ని ఎండబెట్టి 17 శాతం తేమ ఉండేలా చూడాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఇన్‌చార్జి పద్మాకర్‌రెడ్డి, రైతులు రామస్వామి, పద్మానాయక్, యాదయ్య, నాగార్జునరెడ్డి తదితరులు ఉన్నారు.

ఎంపీగా రంజిత్‌రెడ్డిని గెలిపించుకుందాం

చేవెళ్ల మండల కాంగ్రెస్ నాయకులు



చేవెళ్ల మండలంలోని అల్లవాడ గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న మండల నాయకులు

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపించుకుందామని మండల నాయకులు ఎన్నికల ప్రచార సందర్భంగా ఓటర్లను వేడుకుంటున్నారు. చేవెళ్ల మండలంలోని అల్లవాడ గ్రామంలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఓటర్లతో కాంగ్రెస్ పార్టీకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రస్తుతం ఎంపీ రంజిత్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని ఆయనను గెలిపించుకుంటే మన ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. చేతి గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. పేదల పార్టీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మరోసారి ప్రజలు ఆశీర్వదిస్తే కేంద్రంలో కూడా కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ప్రధానిగా, రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అన్ని రంగాల అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటారన్నారు. ప్రతిపక్ష పార్టీలు బీఆర్ఎస్, బీజేపీలకు ఓటు వేస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదని తెలిపారు. రంజిత్‌రెడ్డిని గెలిపించుకొని అభివృద్ధే లక్ష్యంగా నియోజకవర్గంకోసం పని చేయొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బి ఆగిరెడ్డి, దేవేర వెంకట్‌రెడ్డి, సాయిరెడ్డి, టేకుపల్లి శ్రీనివాస్, యాలాల మహేశ్వర్‌రెడ్డి, బి వెంకట్‌రెడ్డి, అల్లవాడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరుబయట చెత్త వేయొద్దు

కమిషనర్ సత్యనారాయణరెడ్డి

తుర్కయంజాల్: తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో వరుసగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపడుతున్నట్లు కమిషనర్ బి.సత్యనారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం 15వ వార్డులోని జెఎన్‌యూఆర్ఎం కాలనీలో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు 30 మంది పారిశుద్ధ్య సిబ్బందిని నియమించి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ కాలనీవాసులతో మాట్లాడుతూ.. చెత్తను ఆరుబయట వేయవద్దన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని సూచించారు. దోమల నివారణ ఫాగింగ్ చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్, పీసీసీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి



బొడ్రాయి ప్రతిష్ఠాపనలో పామెన భీంభరత్, పీసీసీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, చంద్రశేఖర్

షాబాద్: ప్రతీ ఒక్కరికి ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్, పీసీసీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని దామర్లపల్లి గ్రామంలో బొడ్రాయి, నవగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం హనుమాన్ దేవాయంలో కనుల పండువగా నిర్వహించారు. బొడ్రాయి, నవగ్రహ ప్రతిష్ఠాపన పూజలో భాగంగా గణపతి ప్రార్థన ధతుసంస్కారం గర్తసంస్కారం, యంత్ర ప్రతిష్ఠ, మూర్తి ప్రరిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, బలిప్రధానం, పూర్ణాహుతి, మహామంగళమహారతి మంత్రపుష్పం తదుపరి తీర్థప్రసాద వితరణ, మహాదాశీర్వచన నిర్వహించారు. స్థానిక యువకులు, మహిళలతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు తమ ఇష్ట దైవాన్ని కొలవాని, భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతీ ఒక్కరు కొంత సమయాన్ని దేవుని పూజలకు కేటాయించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ బోకుల లింగం, నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు పెంటారెడ్డి, గ్రామస్తులు దయాకర్‌చారి, బాలకృష్ణారెడ్డి, మల్లేశ్, బల్వంత్‌రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల గడ్డపై బీఆర్ఎస్‌దే విజయం

- మోసపూరిత హామీలు నమ్మొద్దు
- బీసీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించండి
- ఎన్నికల ప్రచారంలో మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, మండల అధ్యక్షుడు ప్రభాకర్



దేవునిఎర్రవల్లిలో ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ మండల నాయకులు

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికల్లో మూడో సారి చేవెళ్ల గడ్డపై బీఆర్ఎస్‌దే గెలుపు అని మాజీ ఎంపీపీ ఎం బాల్‌రాజ్, మండల అధ్యక్షుడు పి ప్రభాకర్ పేర్కొన్నారు. మండలంలోని దేవునిఎర్రవల్లి గ్రామంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కేసీఆర్ ఎంతో ఆలోచన చేసి చేవెళ్ల గడ్డపై ప్రజలకు సేవ చేసే నాయకుడు కాసాని ముదిరాజ్‌ను ఎంపిక చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కాసాని గెలుపుతో బీసీల సత్తా చాటినట్టవుతుందన్నారు. పార్టీలకు అతీతంగా బీసీ వర్గాలు ఏకమై కాసానిని గెలిపించుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేసే సత్తా ఆ పార్టీకి లేదన్నారు.

వచ్చిన నాలుగు నెలల్లోనే ప్రజలకు చుక్కలు చూపించిందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో రెప్పపాటు కూడా కరెంట్ పోయేది కాదన్నారు. కానీ ఇప్పుడు కరెంట్ ఎప్పుడు పోతుందో, ఎప్పుడు వస్తుందో తెలియని అయోమయం. రైతులు ఈ విషయాన్ని గమనించి అభివృద్ధికి ఓటేయ్యాలన్నారు. అందుకే మరోసారి మోసపోకుండా బీఆర్ఎస్‌నే గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి, ఎదిరే రాములు, సత్యనారాయణచారి, నర్సింలు, శేరి శివారెడ్డి, రామగౌడ్, క్రిష్ణ, గని, పాండు యాదిరెడ్డి, చింటూ, మహేందర్, రాంప్రసాద్, రాజు, తదితరులు పాల్గొన్నారు.